# కొత్తసీసాలో పాతసారా

వై. రఘునాథరావు



అదొక పల్లెటూరు. పొలాల గట్లమీద పోతున్నారొక తండ్రి, కొడుకు. తండ్రి కొడుకు భుజంమీద చెయ్యి వేసేడు. రెండో చేతితో చుట్టూవున్న పొలాలు చూపిస్తూ అన్నాడు:

'నాయనా ప్రసాదూ! ఈ పొలాలన్నీ ఈ రోజున నావి. రేపు నీవి అయితే ఈ సంపదని నీకు అప్పజెప్పడానికిముందు నాదో హెచ్చరిక. నువ్వు కమ్మవాడివన్న సంగతి మర్చిపోకు. మన కులగౌరవం నిల బెట్టు. మన కమ్మవాళ్ల ఉన్నతికోసం పాటుపడు నువ్వు అనుభవించగా మిగిలిన సంపద ఆంధ్రదేశంలో కమ్మవారిదే పైచెయ్యిగా ఉండడానికి ఖర్చు పెట్టు. మా తరంవాళ్లం కమ్మ బ్రాహ్మళ్లని సృష్టించేం. కమ్మ హాస్టల్సు కట్టేం. కమ్మ కాలేజీలకోసం ప్రయత్నం చేస్తున్నాం. నీతరంవాళ్లు కమ్మ యూని వర్శిటీకోసం పాటుపడాలి. ప్రపంచంలో తన్నుమాలిన ధర్మం లేదుకదా? ఏమం టావ్?' కొడుకు అంగీకారంగా తల ఊపేడు. తండ్రి మళ్లీ ఉత్సాహంగా చెప్పుకుపోయేడు. 'ఇదంతా ఎందువల్ల చెప్తేనంటే, నువ్వు పెద్ద చదువులకి అమె రికా వెళుతున్నావు. అక్కడ నీవేవో పిచ్చి పిచ్చి ఆదర్శాలు బుర్రలోకి ఎక్కించుకొని రాగలవు. మనదేశం ముందుకి పోవడానికి కులాలు అర్థంలేని ఆటంకాలు అని అనుకో గలవు. అది చాలా తప్పు. కులభేదాలవల్ల మనకెంత లాభమో నీకు తెలుసా? మన పొలాల్లో పనిచేస్తున్న ఈతక్కువ కులాల వాళ్లంతా మన చెప్పుచేతల్లో ఎందు కుంటున్నారు? ఈ వెధవలు మన మంటే ఎందుకలా హడలి చస్తున్నారు?'

కొడుకు అర్థమైనట్టు మళ్లీ తల ఆడించేడు. తండ్రి సంతృప్తిగా నవ్వేడు.

* * *

అదొక పట్నం. ఆ పట్నంలోని మెయిన్ రోడ్డు నేషనల్ హైవే మీద ఉంది. అందు చేత ఆ ఒక్క రోడ్డుమాత్రం బాగా వెడ ల్పుగా ఉంటుంది. ఊళ్లో మిగతా రోడ్లు చాలావరకు సందులే. ఆ సందుల్ని ఆ ఊళ్లోవాళ్లు వీధులు అని పిల్చు కుంటారు. అటువంటి సందు వీధిలో ఒకమేడ. ఆమేడమీద గదిలో ఒకతండ్రి కొడుకు భుజంమీద ఒక చెయ్యి వేసేడు. రెండోచేతితో గది కిటికీలోంచి బయటికి చూపిస్తూ 'నాయనా! ఈ మహా

నగరం ఎవరిది? మనరెడ్లది. కొన్నివందల సంవత్సరాలుగా మన రెడ్డిరాజుల కాలంనుంచి ఈ చుట్టుపక్కల దేశం అంతా మనకింద ఉండింది.'

కొడుకు శ్రద్ధగా తలఊపేడు.

'ఈ మహానగరం ఇంతపేరు సంపాదించుకోవడానికి కారణం ఎవరు? మనరెడ్లు. ఈ ఊరునుంచి మనం ఎంతమంది మంత్రులని కేంద్రానికీ, రాష్ట్రానికీ సప్లయి చెయ్యలేదు? అయితే వాళ్ళని మేము ఎలక్షన్లలో గెలిపించేముందు ఒక్కటే హెచ్చరిక చేసేం. ఎవడో కవి ఏమన్నాడు? 'ఏదేశమేగినా ఎందు కాలిడినా—నిలుపరా నీజాతి నిండు గౌరవమును' అన్నాడు. అందుచేత మీరు మంత్రులుగా అయినతర్వాత మన రెడ్డి జాతి నిండు గౌరవాన్ని నిలబెట్టాలి. మర్చిపోవద్దు. మన రెడ్లంతా బాగుపడుతూ ఉంటే తెలుగుదేశంకూడా బాగుపడ్డట్టే కదా? తెలుగుదేశం బాగుపడితే భారతదేశం బాగుపడ్డట్టేకదా?'

కొడుకు అంగీకారంగా తలూపేడు. తండ్రి సంతోషించేడు. 'నువ్వు కలకత్తాలో పెద్దచదువులకి పోతున్నావు. అక్కడ ఈ బంగాళీవాళ్ళతోనూ హిందూస్తానీ వాళ్ళతోనూ సహవాసంచేసి ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు బుర్రలోకి ఎక్కించుకొని రాగలవు. మనమంతా ఒకే భారత జాతి వాళ్ళం అని ఎవడైనా తెలివితక్కువ వాడు నీకు చెప్పగలడు నువ్వు వెంటనే ఒప్పుకోకు. కాని నమ్మకు. మనదేశంలో నాలుగు జాతులున్నాయి. 'బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కమ్మ. 'మాల' అని మరోజాతి ఉన్నారు. కాని వాళ్ళు సరిగ్గా మనుష్యుల్లోకి లెక్కరారు. వాళ్ళని మేమందరం జంతువుల్లా వాడుకుంటాం. అందుచేత వాళ్ళని వదలి పెట్టేసు. ఈ పరమ సత్యాన్ని గుర్తుంచుకో. మన రెడ్డి జాతిఔన్నత్యం కోసం పాటుపడు. అప్పుడేనువ్వు బాగుపడతావు ముందుకు వెళతావు'

కొడుకు జ్ఞానోదయం అయినట్టు కళ్ళుమూసి తలఊపేడు. తండ్రి సంతృప్తిగా నవ్వుకున్నాడు.

*  *  *

అదొక కాలేజి. మేడమీద ఒకగది తలుపు మీద బోర్డు ఒకటి ఉంది: 'ప్రిన్సిపాల్: బ్రహ్మశ్రీ బ్రాహ్మణపల్లి సుబ్రహ్మణ్యం పంతులుగారు.' ఆ గదిలోపల ఒక తండ్రి కొడుకు ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. తండ్రి కొడుకు భుజం మీద ఒక చెయ్యి వేసేడు. రెండో చేతితో కాలేజీ ఆవరణంతా చూపిస్తూ 'నాయనా శాస్త్రీ! ఈ కాలేజీ ఈ ఊరి జమీందారుగారు కట్టేరు. వారి దివానుగా ఉండేవారు మా నాన్నగారు. ఆ విధంగా ఈ కాలేజీ మన బ్రాహ్మల హయాంలోకి వచ్చింది. ఈ కాలేజీ మూలంగా మన బ్రాహ్మలు ఎంత మంది బాగుపడుతున్నారో తెలుసా? ఇక్కడున్న లెక్చరర్లంతా మనవాళ్ళే. నువ్వు పెద్ద చదువులకి కాశీ వెళుతున్నావు. అటునుంచి వచ్చేక ఈ కాలేజీలో నీకో స్థానం ఉంచుతాను. తర్వాత ఈ కాలేజీకి ప్రిన్సిపాల్ వౌతావు. అప్పుడు ఈ సాంప్రదాయాన్ని నువ్వు కన్‌టిన్యూ చెయ్యాలి. అన్ని కులాలలోనూ బ్రాహ్మణులదే ఎప్పటికైనా పైచెయ్యి అని నిరూపించాలి. ఏమంటావ్?'

కొడుకు అర్థమైనట్లు తల ఊపేడు. తండ్రి సంతోషించేడు. 'బ్రాహ్మణులంటే ఎవరు? అపర బ్రహ్మలు. బ్రహ్మదేముడు మనుష్యుల్ని సృష్టించేడు. మనం కులాల్ని సృష్టించేం. మన ముత్తాతలు బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర అని నాలుగు కులాలే సృష్టించేరు. మనం అంతకన్న ఓ మెట్టు పైకి పోయేం. 'మాల' అనే మరో కులాన్ని సృష్టించేం. బ్రాహ్మణుల్లో వైదీకులు, నియోగులు అనే ఇద్దరు బ్రాహ్మణుల్ని సృష్టించేం. చూసేవా మన ఘనత!'

తండ్రి గర్వంగా కొడుకువైపు చూసేడు. కొడుకు భక్తి భావంతో తల వంచేడు. తండ్రి మళ్ళీ ప్రారంభించేడు.

'మా తండ్రిగారి హయాంలో ఎలా ఉండేదో తెలుసా? మాదిగవాడు చెప్పులు కుట్టి తీసుకొస్తే బ్రాహ్మణవీధి చివ్వారని నిలబడి కేకేయ్యాల్సిందే వీధిలో నడవడానికేనా అర్హత ఉండేదికాదు. ఇప్పుడా రోజులు మారేయి. మిగతా శూద్రులు బాగా మేలుకొని మనమీద తిరగబడుతున్నారు. కాని ఈ మాలవాళ్ళు మాత్రం ఇంకా మన కన్‌ట్రోల్‌లోనే ఉన్నారు. ఏది ఎలా ఉంటేనేం? మన బ్రాహ్మలకున్న పవిత్రత, నిజాయితీ, మిగతా కులాలవాళ్ళకి లేవు. ఇంతకీ ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే కాశీలో ఈ రెడ్లు, కమ్మవాళ్ళు, మాల, మాదిగ మొదలయిన అడ్డమైన వాళ్ళలో తిరిగి చెడిపోకు వాళ్ళు మాంసాలు తింటారు. తాగుతారు. మన్నటువంటి పాపపు పనులు చెయ్యకు. ఒకవేళ చెయ్యాలని బుద్ధిపుట్టినా చాటుగా చెయ్యి. నలుగురికీ తెలిసేటట్టు చెయ్యవద్దు. ఇంకో చిన్నవిషయం. మనం వైదీకులం. అందుచేత ఈ నియోగప్పు ముండా కొడుకులుంటారే, వాళ్ళనికూడా ఎడంగానే ఉంచు. నువ్వు బ్రాహ్మణులకోసం పాటు పడ్డా, బ్రాహ్మణుల్లో వైదీకుల బాగు కోసం కృషిచెయ్యి. తన్నుమాలిన ధర్మం ప్రపంచంలో లేదుకదా?'

కొడుకు వినయంతో తలవంచేడు, తండ్రి కొడుకుని ఆశీర్వదించేడు.

*  *  *

ప్రసాదూ, రెడ్డి, శాస్త్రి ఒకే రైలు బండిలో కలకత్తావరకు ప్రయాణంచేసేరు. ప్రసాదు కూర్చున్న బెర్తుమీద జాగా ఉన్నా శాస్త్రి కూర్చుంటాసంటే వీలు లేదన్నాడు. రెడ్డికి మంరో రెడ్డి జాగా ఇచ్చేడు. శాస్త్రికి ఒక సాయిబు జాగా ఇస్తే అయిష్టంగా మొఖం చిట్లించి సాయిబుకి కాస్త ఎడంగా కూర్చున్నాడు. డైనింగ్ కార్‌లో ముగ్గురూ మూడు జాగాల్లో భోజనానికి కూర్చున్నారు. టికెట్ కలక్టర్ చెకింగ్‌కి వస్తే 'వాడిదగ్గర ఎక్సెస్ లగేజి ఉన్నట్టుంది. పట్టుకోండి' అన్నాడు శాస్త్రి ప్రసాద్‌ని చూపిస్తూ. రైల్వే పోలీసుని పిలిచి 'వాడి సామాన్లలో దొంగ సొమ్మున్నట్టు అనుమానంగా ఉంది. సోదా చెయ్యండి' అన్నాడు ప్రసాదు శాస్త్రిని చూపిస్తూ. రెడ్లిద్దరూ [illegible] ఆడడానికి [illegible] కోసం సంపాద్యమొత్తంతా వదిలేరు. కాని ప్రసాద్‌ని, శాస్త్రిని మాత్రం పిలవలేదు.

*  *  *

ఖరగ్‌పూర్‌లో ఒక తెలుగు కుటుంబం కంపార్టుమెంటులోకి ఎక్కేరు.

'మీ దేశం ఏ ఊరండీ?' అని అడిగేడు ప్రసాదు.

'మాది తెనాలి' అన్నాడు ఖరగ్‌పూర్‌లో బండి ఎక్కిన ఆసామీ.

'మీ పేరు?'

'సుబ్బారావు'

'మీదేకులం?'

సుబ్బారావు భార్యవైపు చూసేడు ఆమె నవ్వింది

'నేను తెలుగువాణ్ణండీ' అన్నాడాయన కూడా నవ్వుతూ. ప్రసాద్‌కి కోపం వచ్చి ముఖం రెండోవైపుకి తిప్పుకున్నాడు. సుబ్బారావుగారి అబ్బాయి రెడ్డి దగ్గరికి

'నీ పేరేమిటబ్బాయ్?' అన్నాడు రెడ్డి.

కుర్రవాడు అర్థం కానట్టు మొఖం పెట్టేడు. సుబ్బారావు భార్య హిందీలో 'నీ పేరేమిటని అడుగుతున్నారు చెప్పు.' అంది కుర్రవాడితో.

'మేరానామ్ సురేష్‌హై' అన్నాడు వాడు రెడ్డితో.

'మీ అబ్బాయికి తెలుగురాదా?' అన్నాడు శాస్త్రి సుబ్బారావుతో.

'రాదండీ. మేమీ ఉత్తర దేశాల్లో చాలా సంవత్సరాలుగా ఉండిపోయేం.' అన్నాడు సుబ్బారావు.

'ఉండిపోతే మాత్రం? మీరు ఇంట్లో తెలుగు నేర్పరాదా?' అన్నాడు శాస్త్రి.

'అంత అవసరమేమొచ్చింది?' అన్నాడు సుబ్బారావు.

'అవసరం ఎంతైనా ఉండి. మీ కుర్రవాడు పెద్దయేక వాడికి మీరు పెళ్లి చేయాలా? అప్పుడెవరికి చేస్తారు?' అన్నాడు శాస్త్రి.

'ఆ! అప్పటికి ఎవరో అమ్మాయి దొరక్కపోతుందా?' అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

'నవ్వులాట కాదు. ఇది చాలా పెద్ద సమస్య సుమండీ! మిగతా భాషల వాళ్లెవరూ మీ అబ్బాయికి పిల్లనివ్వరు గదా? ఇక తెలుగురాని తెలుగువాడికి తెలుగు పిల్లనెవరిస్తారు?'

సుబ్బారావు భార్య బిగ్గరగా నవ్వింది.

'మీలాటి వెర్రి బాపనోడెవడైనా ఇవ్వడా?' అందామె. శాస్త్రి ముఖం కందింది. 'నేను బ్రాహ్మణ్నని ఎలా పోల్చేరు?' అన్నాడు కొంచెం ఆశ్చర్యంగా. సుబ్బారావు సీరియస్‌గా అన్నాడు.

'ఆ మాత్రం పోల్చలేమా? ఆ ముఖ వర్చస్సు, స్వచ్ఛమైన మీ మాటల తీరూ, మీ మాటలలో ఉన్న సంస్కారం...' సుబ్బారావు మాటలలో వ్యంగ్యం, హేళన ఉన్నాయి. 'మరో చిన్న విషయం నాదో కులం—నా భార్యదో కులం. తెలుగు నేర్చుకున్నా మా అబ్బాయికి ఏ కులం వారు పిల్లనిస్తారు?'

*        *        *

కాలిఫోర్నియాలో ప్రసాద్‌ని ఒక స్నేహితుడు రిసీవ్ చేసుకున్నాడు. ఆ స్నేహితుడు ఒక నీగ్రో ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. ప్రసాద్‌కి కష్టమనిపించింది.


# కొత్తసీసాలో...

'ఏదేమిట్రా? ఎవడైనా తెల్లవాడి ఇల్లు సంపాదించక ఈ నీగ్రోగాడి ఇంట్లో ఉంటున్నావా? నీకేం ఖర్మపట్టిందిరా?' అని అడిగేడు.

'ఖర్మపట్టకేం? ఈ దేశంలో మన ఆసియా వాసులకి తెల్లవాడి ఇల్లు అద్దెకి దొరకడం చాలా కష్టం. నువ్వీ దేశంలో ఇప్పుడే అడుగుపెట్టేవు కాబట్టి ముందుగానే ఒక హెచ్చరిక చేస్తున్నాను. నువ్వు నల్లగా ఉంటావు. అందుచేత ఈ దేశంలో నిన్ను నీగ్రోకింద జమకడతారు. ఎందుకైనా మంచిది. తెల్లవాళ్లతో కాస్త మెలకువగా ఉండు. కొన్ని కొన్ని హోటళ్లలోకి నిన్ను రానివ్వరు. వాళ్లతో తగువుపెట్టుకోకు. కొందరు తెల్లవాళ్లు నిన్ను హీనంగా చూస్తారు. పట్టించుకోకు. ఇదంతా మొదట్లో నీకు కొంచెం కష్టంగా ఉంటుంది. కొన్నాళ్లకి అలవాటైపోతుందిలే.'

ఆరాత్రి ప్రసాద్‌కి చాలాసేపటివరకు నిద్రపట్టలేదు. ఎంతో కష్టంమీద తెల్లవారు జామున నిద్రపోయేడు. ఆ నిద్రలో అతనికో పీడకల వచ్చింది.

ఒక మైదానంలో మూడు గుంజలకి ప్రసాద్, రెడ్డి, శాస్త్రి కట్టబడి ఉన్నారు. ముగ్గురికీ చొక్కాలు లేవు. చిరిగి, పీలికలై, మాసిన పంచెలు కట్టుకున్నారు. ఎండలో వాళ్ల నల్లని శరీరాల మీద చెమట ధారగా కారుతోంది. వీళ్ల చుట్టూ కొన్ని వందలమంది అమెరికన్లు గోలచేస్తూ గెంతుతున్నారు. వాళ్లందరూ తెల్లటి శుభ్రమైన పంచలు కట్టుకున్నారు. కొందరు విభూతులు నుదుటన రాసుకున్నారు. కొందరు పట్టెనామాలు పెట్టుకున్నారు. మరికొందరికి బారెడు



పిలకలున్నాయి. అందరికీ జంధ్యాలున్నాయి.

'కాల్చండి ఈ మాలవెధవల్ని' అని అరుస్తున్నారు అమెరికన్‌లందరూ.

'మేము మాలవాళ్లం కాము' అన్నారు ఈ ముగ్గురూ.

'మరెవరు?'

'మేము ఉత్తమ కులస్థులం' అన్నారు ఈ ముగ్గురూ.

తెల్లవాళ్లంతా గొల్లున నవ్వేరు.

'మీరు ఉత్తమ కులస్థులెలా అయేరు?'

'మేము ఉత్తమ కులంలో పుట్టేం కాబట్టి.'

తెల్లవాళ్లు మళ్లీ నవ్వేరు.

'మా దేశంలో పుట్టుకని బట్టి కులాలులేవు. ఇక్కడ కులాలు మనిషి రంగుని బట్టి. నువ్వు తెల్లజాతి వాడివైతే బ్రాహ్మడివి, నల్లజాతి వాడివైతే మాలవాడివి. కాబట్టి మీరంతా ఎవరూ?'

'మాలవాళ్లు' అన్నారు అంతా ఏక కంఠంతో.

'కాబట్టి?'

'కాల్చండి వెధవల్ని' అన్నారు అంతా ఏక కంఠంతో..

'పూజారి ఏడీ?' అన్నారెవరో.

'వస్తున్నా వస్తున్నా! దారి తప్పుకోండి. మడి—మడి' అని అరుస్తూ ఒక పెద్ద పిలక పెట్టుకొన్న అమెరికన్ ఒకడు ఒక నీళ్ల బిందెని తలమీద పెట్టుకొని బిరబిర నడుచుకుంటూ వచ్చేడు. అతడి కుడి చేతిలో మామిడి కొమ్మలున్నాయి. ఆ కొమ్మల్ని బిందెలో ముంచి వీళ్ల ముగ్గురి మీదా జల్లేడు ఏవో మంత్రాలు బిగ్గరగా చదువుతూ.

'ఇదేమిటి? ఈ నీళ్లు కిరసనాయిలు కంపు కొడుతున్నాయి?' అని ఏడ్చేడు శాస్త్రి.

తెల్లవాళ్లంతా గొల్లున నవ్వేరు.

'మాల పీనుగులకి స్వర్గానికి పంపించడానికి మడినీళ్లు కిరసనాయిలు కాకపోతే గంగాజలం పోస్తారనుకున్నావా ముండా?' అన్నాడు పూజారి.

'ఆ! మంత్రజలం జల్లేసేను. ఇక మీ పని కానివ్వండి' అన్నాడు పూజారి.

ఈ ముగ్గురికీ నిప్పంటించేరు. అక్కడున్న జనమంతా చప్పట్లు కొట్టేరు. మూడు గుంజల మీది నుంచి మూడు మంటలు రాకాసుల నెత్తురునాలికల వాలు అంతరిక్షానికి ఎగబాకాయి.